## పోలీసు అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె ప్రభాకర్‌రావు అధ్యక్షతన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని కోర్టు హాల్‌లో జాతీయ లోక్ అదాలత‌పై పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుల్‌లతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఈ నెల 30వ తారీఖున నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ నందు క్రిమినల్ కంపౌండబుల్ కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జాతీయ లోక్ అదాలత్ విజయవంతం అయ్యేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు అందచేశారు. కార్యక్రమంలో సైబరాబాద్ ఎసిపి నరసింహరావు, సంగారెడ్డి, పటాన్‌చెరు డిఎస్‌పి జె రమేష్, పి బాలాజీ, సిఐ, ఎస్‌ఐలు కోర్టు కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## రూ. 11 లక్షలకు తలనీలాల టెండర్ ఖరారు

**-మిగతా టెండర్లు వాయిదా**

**పాపన్నపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయంలో సోమవారం తలనీలాల టెండర్‌ను నిర్వహించి మిగతా టెండర్‌లను వాయిదా వేశారు. తలనీలాల టెండర్‌ను రూ. 11 లక్షల ఖరారైనట్లు ఇఓ మోహన్‌రెడ్డి తెలిపారు. కొబ్బరికాయల టెండర్ గత ఏడాది 1.37 కోట్లకు ఖరారు కాగా ఈమారు 70లోపు వద్ద పాట ఆగిపోయింది. ఒడి బియ్యం, కొబ్బరి ముక్కలు, పూజా సామాను, ఎగ్జిబిషన్ టెండర్‌లు ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడంతో టెండర్‌లను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మరో మారు టెండర్‌లు నిర్వహిస్తామని మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మారు టెండర్‌లో పాల్గొనే వ్యక్తులు టెండర్ డబ్బులను మొత్తం ముందస్తుగా డిడి రూపంలో చెల్లించాలని నిబంధన పెట్టడంతో తాము ఎక్కువ పాట పాడలేకపోయినట్లు టెండర్ దారులు తెలిపారు. గతంలో టెండర్‌లు పొందిన వారు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించనందునే మొత్తం డబ్బులు చెల్లించాలని నిబంధన పెట్టినట్లు ఈఓ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



పొన్నం ప్రభాకర్‌ను గజమాలతో సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

## పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం

**గజ్వేల్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** గౌడ కులస్తుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్లుగీత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు లింగంగారి రాజాగౌడ్, గౌడ సంఘం నాయకుడు దేవేందర్‌గౌడ్‌లు పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణానికి విచ్చేసిన రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో గౌడ కులస్తులైన పొన్నం ప్రభాకర్‌కు మంత్రి పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. గౌడల సంక్షేమం కోసం నూతన ప్రభుత్వం పని చేయాలని ఈ సందర్భంగా కోరారు. అనంతరం ప్రజ్ఞాపూర్ నుండి గజ్వేల్ వరకు ర్యాలీగా తరలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ గౌడ సంఘం నాయకులు నక్క రాములుగౌడ్, జంగం రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌గౌడ్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూపులు వీడకుంటే మల్లన్నసాగర్‌లో మునుగుతారు

**మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గ్రూపులు వీడి కలిసికట్టుగా పని చేయకుంటే మల్లన్నసాగర్ డ్యాంలో మునుగుతారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అసక్తికరమైన వ్యాఖ్యాలు చేశారు. జిల్లా కే ంద్రంలోని పార్టీ కార్యాలయంలో అయన విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్‌లో పార్టీ పరంగా ఏ కార్యక్రమం నిర్వహించిన ఒకటే జరుగుతుందన్నారు. గ్రూపులుగా విడిపోయి పార్టీకి నష్టం చేస్తే సహించేది లేదన్నారు. డీసీసీ అధ్యక్షులు, నియోజకవర్గం ఇ ంచార్జి నేతృత్వంలో అందరు కలిసి పార్టీ కార్యక్రమాలను ఒకే చోట నిర్వహించాలన్నారు. ఎంపి, స్థానిక సంస్థలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పది యేండ్ల బిఆర్ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. కార్యకర్తలకు ఎల్లావేళాల అందుబాటులో ఉంటా ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం రంగాధాంపల్లి చౌరస్తాలోని అమరవీరుల స్థూపానికి అయన ఘనంగా నివాళులర్పించారు.

## నేడు బిఆర్ఎస్ కృతజ్ఞత సభ

**-హాజరవుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు**

**జహీరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ శాసన సభ స్థానం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావును శాసన సభ్యుడిగా ఎన్నుకునందుకు కృతజ్ఞతగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తారీఖున పట్టణంలోని పివిఆర్ గార్డెన్‌లో కృతజ్ఞత సభను నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కృతజ్ఞత సభకు మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని నాయకులు వినతి చేశారు.

## అన్నదాతలు విద్యుత్ బకాయిలను చెల్లించాలి

**-విద్యుత్ శాఖ ఏఈ ఎండి. అహ్మద్ అలీ**

**కొల్చారం, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** అన్నదాతలు బోరు బావులకు సంబంధించిన విద్యుత్ బకాయిలను చెల్లించాలని ఏఈ ఎండి. అహ్మద్ అలీ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన కొల్చారంలోని ఆయన ఛాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యుత్ శాఖ ఏఈ ఎండి. అహ్మద్ అలీ మాట్లాడుతూ మండలంలో మొత్తం 6,5336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రైతులు కలిగి ఉన్నారని, వాటికి సంబంధించి మండలంలో 69 లక్షల 8 వేల 75 రూపాయలు రైతులు బకాయిలు ఉన్నారని తెలిపారు. వరి కోతలు కూడా పూర్తయ్యాయని, రైతులు బకాయిలు చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఎండి. అహ్మద్ అలీ స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ కో-ఆప్షన్ సభ్యురాలు రాజీనామా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
సిద్దిపేట మున్సిపల్ బిఆర్ఎస్ కో-అప్షన్ సభ్యురాలు రుక్సార్ ఖానమ్ సోమవారం పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలో అందజేశారు. రెండు సంవత్సరాల నుంచి బిఆర్ఎస్ కో-అప్షన్ సభ్యురాలుగా కొనసాగుతున్న రుక్సార్ ఖానమ్ అనివార్య కారణాలతో కో-అప్షన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రెండు యేండ్లుగా తనకు సహకరించిన మున్సిపల్ అధికారులకు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), డిసెంబర్ 11, ప్రభాతవార్త :** కార్తీక మాసం చివరి సోమవారంకావడంతో భక్తులు అధికసంఖ్యలో శివలాయాలకు తరలి వచ్చి భక్తి శ్రద్దలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలో రామేశ్వరంపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అలయంలో రామలింగేశ్వర స్వామికి అలాగే చౌదర్‌పల్లి గ్రామంలో దుబ్బారాజేశ్వర స్వామిలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో అలయ పూజారులు సాంకేత్ శర్మ, భాను ప్రసాద్ శర్మ, అలయ చైర్మన్ చంద్రం, పొతనక సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

## ముళ్లపొదల్లో మగ శిశువు మృతదేహం

**-శిశువును పీక్కుతిన్న పందులు, కుక్కలు**

**జహీరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ఏ తల్లికి పుట్టిన బిడ్డనో తెలియదు కాని లోకాన్ని చూసిన క్షణాల్లోనే ఈ శిశువుకు నిండు నూరేళ్లు నిండిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలోని హమ్మర్‌నగర్ కాలనీలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం... పణంలోని హమ్మర్ నగర్ కాలనీలో ముళ్ల పొదల్లో ఒక మగ శిశువు కానవచ్చిందన్నారు. శిశువు శవాన్ని పందులు, కుక్కలు పీక్కుతినడంతో శవం రెండు భాగాలుగా విడిపోయింది. ఎస్ఐ శ్రీకాంత్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు..

# 'ప్రజావాణి'పై ప్రజలకు నమ్మకం పెరిగింది

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ప్రజావాణి.. జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలను విని పరిష్కరించడానికి మొదలుపెట్టిన గొప్ప కార్యక్రమం అని జిల్లా పాలనా ధికారి ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీక రించి మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి తమ సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జిదారులు ఎంతో అశతో కార్యాలయంకు వస్తారని అందరికీ న్యాయం చేయడం అధికారుల కర్తవ్యమ న్నారు. అర్జిదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. ప్రజలకు ప్రజావాణి కార్యక్రమంపై నమ్మకం పెరిగింద న్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్‌డిఎ పిడి జయదేవ్ అర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న దృశ్యం

**డబుల్ బెడ్‌రూంలను వెంటనే అందించాలి...**

**గజ్వేల్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):**
గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందజేయడం కోసం లక్కీ డ్రా తీసి ఎంపిక చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు కేటాయించలేదని సోమవారం సిద్దిపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయిస్తామని లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారని, ఇంత వరకు కేటాయించకపోవడం ఏమిటన్నారు. గజ్వేల్‌పట్టణంలో 20 సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక కిరాయికట్టుకుంటూ బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామని, నాడు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు హయాంలో కట్టించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు సైతం బీటలువారినా అధికారులు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. వెంటనే లక్కీడ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ళను అందించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గజ్వేల్ పట్టణంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ళ వద్ద నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్‌రూం



మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ రోజాశర్మ

## ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దు

**వర్షంతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి**

**జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంగా చేయరాదని..కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో 2,3,4,వ స్థాయి సంఘాల సమావేశాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. యాసంగి సీజన్ పంటలకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. పామాయిల్, మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశాలలో ఎమ్మెల్సీ యాదవరడెడ్డి, జడ్పీటీసీలు లక్ష్మి, కొండల్‌రెడ్డి, కో-అప్షన్ సభ్యులు సలీం, వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్**

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి కలెక్టర్ శరత్, అదనపుకలెక్టర్ మాధురితో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు, ఉద్యోగం చూపాలని, ట్రైసైకిళ్లు అందచేయాలని, వికలాంగుల పింఛన్ అందచేయాలని కోరుతూ ప్రజలు అధికారులకు ధరఖాస్తులు అందచేశారరు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరకరించాలని అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 27 ధరఖాస్తులు వచ్చాయని, అందులో 9 రెవెన్యూ శాఖకు సంబంధించినవి కాగా ఇతర శాఖలకు చెందిన 18 ధరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. గుమ్మడిదల మండలం నాగిరెడ్డి గూడెంకు చెందిన మహిళ భర్త పేరిట ఉన్న 5 ఎకరాలు తన పేరున మార్చాలని కోరుతూ అర్జీ చేయగా కలెక్టర్ స్పందించి గుమ్మడిదల తహసీల్దారకు ఫోన్లో మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ నగేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ శరత్

## 'ప్రజావాణి'ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా పాలనాధికారి రాజర్షిషా**

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ప్రతి సోమవారం నిర్వహించి ప్రజా ఫిర్యాదుల విభాగంలో సోమవారం జిల్లా పాలనాధికారి రాజర్షిషా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా పాలనాధికారి రాజర్షిషా ప్రజవాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అధికారులు వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం 16 దరఖాస్తులు వచ్చాయని, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, పెన్షన్‌లపై దరఖాస్తులు వచ్చాయాని అన్నారు. ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను దరఖాస్తులను స్వీకరిస్తున్న పాలనాధికారి రాజర్షిషా

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

**-జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి**



సంగారెడ్డి చౌరస్తాను పరిశీలిస్తున్న జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని జిల్లా ఎస్‌పి సిహెచ్ రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డితో పాటు జిల్లాలోని జాతీయ రహదారిపైగల పటాన్‌చెరులలోని ప్రధాన ట్రాఫిక్ పాయింట్‌లను జిల్లా ఎస్‌పి సందర్శించారు. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్‌లను, పాదచారులు రోడ్డు దాటేందుకు వేసిన జీబ్రా క్రాసింగ్ లైన్స్‌లను ఎస్‌పి పరిశీలించారు. జాతీయ రహదారి వెంబడి లింక్‌రోడ్డులవద్ద సైన్ బోర్డ్స్ ఉండేలా చూడాలన్నారు. సమస్యలు ఎమైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలన్నారు. పాదచారులకు, వాహనచోదకులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు, సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌ను, కార్లు చోదకులు బెల్టును ధరించాలన్నారు. స్పీడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్ అనేది చాలా ప్రమాద కరమని గుర్తు చేశారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన సిసి కెమెరాలు స్పీడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంప్‌లను రికార్డు చేయడంతో పాటు ఫోటోలను చిత్రీకరించి పంపడం జరుగుతున్న విషయాన్ని ప్రతి వాహన చోదకుడు గుర్తించుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి వెంట అదనపుఎస్పీ పి అశోక్, యస్‌బి ఇన్స్‌పెక్టర్ శివలింగం, సంగారెడ్డి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, పటాన్‌చెరు ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

## అదుపు తప్పి ట్రాక్టర్ బోల్తా..యువకుడికి గాయాలు

**బెజ్జంకి, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటన సోమవారం మండలపరిధిలోని గుండారంగ్రామంలో జరిగింది. గుండారంలోగల చెరువుకట్టపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కట్టపైనుంచి కిందపడడంతో డ్రైవర్ గడిమెట్ల మహిపాల్‌రెడ్డి(35)కి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే బోల్తాపడిన ట్రాక్టర్‌ను తొలగించి గాయపడిన మహిపాల్‌రెడ్డిని అసుపత్రికి తరలించారు.

# నిర్లక్ష్యపు నీడలో డయాలసిస్ సెంటర్

**-అందుబాటులో ఉండని వైద్యులు**
**-అత్యవసరం అయితే నిమ్స్‌యే దిక్కు**

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 11 ప్రభాతవార్త:**
ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని గత పాలకులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. వైద్యరంగం పూర్తి నిర్లక్ష్యానికి గురవుతుంది. పేరుకు భవనాలు నిర్మించినా మౌలిక వసతుల కల్పనతోపాటు వైద్యుల నియామకాల్లో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 5ఏళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన డయాలసిస్ కేంద్రం పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకుండా రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

**రోగుల ప్రాణాలతో చెలగాటం...**

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ అనేది నిత్యకృత్యం లాంటిది. వారానికి కనీసం రెండు మూడుసార్లు చేయించుకోవాల్సి వస్తుంది. ఇక పాజిటీవ్ రోగుల అవసరాన్ని బట్టి మరింత ఎక్కువసార్లు చేయాల్సి వస్తుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న వైద్యం. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఒక్కసారి డయాలసిస్ చేయించుకునేందుకు కనీసం 3-5 వేల రూపాయల ఖర్చు వస్తుంది. వారంలో ఒకటి అంతకుమించి ఎక్కువసార్లు డయాలసిస్ అవసరమైనవారు ఆర్థిక ఇబ్బందులతో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కోకొల్లలు. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్య తెలంగాణ పేరుతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటుచేసి అందరికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం నిర్లక్ష్యం వెంటాడుతుంది. ఒక రోగికి డయాలసిస్ చేయడానికి నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ సమయంలో రోగికి బీపీ ఎక్కువ తక్కువ అవడంతో పాటు అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి. వాటినుంచి రక్షించేందుకు ఎండి ఫిజీషియన్ అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా డయాలసిస్ రోగులకు నెఫ్రాలజీ వైద్యుల పర్యవేక్షణలోనే డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటి నిబంధనలు ఏవిపాటించకుండా ఆన్ కాల్ ఫోన్‌లో మాత్రమే సూచనలు చేస్తూ టెక్నీషియన్‌ల ద్వారా డయాలసిస్ కేంద్రాన్ని నడిపిస్తున్నారు. డయాలసిస్ ప్రక్రియలో భాగంగా ఇప్పటివరకు చాలామంది రోగులు అస్వస్థతకు గురికావడంతో నిమ్స్‌కు పంపించిన సంఘటన కోకొల్లలు.



జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రం

**5 సంవత్సరాలు పూర్తయినా తప్పని కరెంట్ తిప్పలు...**

డయాలసిస్ ప్రక్రియ నిర్వహించేందుకు ఆర్‌వోఆర్ ప్లాంట్ శుద్ధి నీటితోపాటు కరెంట్ సౌకర్యం, ఏసీసౌకర్యం అవసరం పడుతుంది. ఐదేళ్ల క్రితం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించినప్పటికీ ఇప్పటికీ చాలాసమస్యలు డయాలసిస్ కేంద్రాన్ని పట్టి పీడిస్తున్నాయి. సౌకర్యాల లేమితో ఎన్నో రోజులు డయాలసిస్ నిలిచిపోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో రోగులు తప్పని పరిస్థితుల్లో తిరిగి ప్రైవేట్ ఆసుపత్రులనే ఆశ్రయించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో కరెంట్ కష్టాలు తప్పడం లేదు. ఏదైనా కారణంతో కరెంట్ పోతే రోగులు ఎదుర్కొనే అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. డయాలసిస్ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలోనూ కరెంట్ పోవడంతో రోగులు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటనలు ఉన్నాయి. సోమవారం కరెంట్ లేకపోవడంతో ఉదయం 10 గంటల నుంచి వచ్చిన రోగులు పడిగాపులు కాసారు. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో 9 నెగెటివ్, 1 పాజిటీవ్ బెడ్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు 70 మంది డయాలసిస్ రోగులు రిజిష్టర్‌కాగా రోజు 30 మందికి డయాలసిస్ కొనసాగుతుంది. కాగా కరెంటు సమస్య తలెత్తడంతో డయాలసిస్ రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సోమవారం చేగుంటకు చెందిన ముదిగొండ కృష్ణ అనే రోగి ఉదయం 10 గంటల నుండి పడిగాపులు కాస్తున్నాడు. అదేవిధంగా రంగంపేటకు చెందిన కోట సుభాష్ మధ్యాహ్నం 1 గంటల నుండి 5 గంటల వరకు ఆసుపత్రి బయటే వేచి ఉండి నానా అవస్థలు పడ్డారు.

**సమస్యల పరిష్కారానికై కొత్త ఎమ్మెల్యే చొరవ చూపాలి...**

దాదాపు ఆరు సంవత్సరాలు గడుస్తున్నా జిల్లాలోని జిల్లా కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. కరెంటుతోపాటు వైద్యుల కొరతపై ఇప్పటివరకు రోగులు చాలా సార్లు ఆందోళనలు నిర్వహించారు. అయినప్పటికీ ఎక్కడవేసిన గంగళి అక్కడే అన్న చందంగా అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా కొత్త ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ స్పందించి డయాలసిస్ వ్యధిగ్రస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

**అవస్తలు పడుతున్నాం.. ముదిగొండ కృష్ణ, చేగుంట**

కిడ్నీలు పాడవడంతో నేను డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఆర్థిక భారంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లకుండా ఇక్కడికి వస్తే ఇక్కడి ఇబ్బందులతో నానా అవస్థలు పడుతున్నాం. అయినప్పటికీ డబ్బులు లేకపోవడంతో ప్రాణ భయంతో అయినా ఇక్కడే డయాలసిస్ చేయించుకుంటున్నాను. అధికారులు మాపై దయ చూపించాలి.



డాక్టర్ చంద్రశేఖర్, డీసీహెచ్

**ఎప్పుడు కరెంట్‌పోతుందోనని భయంవేస్తుంది.. సుభాష్,రంగంపేట**

ప్రైవేటుఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకొని ఆర్థికంగా చితికిపోయాను. అలాంటి సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్‌కేంద్రం ఏర్పాటుచేయడంతో సంతోషపడ్డాను. కానీ ఇక్కడ సమస్యలు చూస్తుంటే డయాలసిస్ రోగం కన్న ఈ పరిస్థితులే ఎక్కువ భయపెడుతున్నాయి.

**జనరేటర్ ఏర్పాటు చేయాలని సూచించాం**

**డాక్టర్ పి. చంద్రశేఖర్, డీసీహెచ్**

డయాలసిస్ కేంద్రంలో ప్రత్యేకంగా జనరేటర్ ఏర్పాటు చేయాలని సంబంధిత ఏజెన్సీ వారికి గతంలోనే చెప్పడం జరిగింది. ప్రస్తుతం అవసరమైతే ఆసుపత్రిలో ఉన్న జనరేటర్‌ను వినియోగిస్తున్నాం. అయినా కొన్ని సందర్భాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.



డయాలసిస్ రోగోలు కృష్ణ, సుభాష్



## మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన బ్రాహ్మణ సంక్షేమ వేదిక

నాంపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికైన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీశాఖ మంత్రిగా నియమితులైనందుకు హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాలశ్రీనివాసులు, తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ చొప్పకట్ల రాము, కోశాధికారి రాజేశ్వరరావు, సహకార్యదర్శులు చోడవరపు శ్రీనివాసరావు, నేరళ్ళ మల్లికార్జున్ తదితరులు కలిసి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు అమలు చేస్తున్న పథకాలను కొనసాగించి బ్రాహ్మణ సమాజానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## మహాలక్ష్మీ పథకం పట్ల మహిళల హర్షం



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న భద్రినాథ్ యాదవ్, మహిళలు

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: పేద, మధ్యతరగతి మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు తీసుకువచ్చిన మహాలక్ష్మీ పథకం పట్ల మహిళలు హర్ష వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మహిళలు పాలాభిషేకం నిర్వహించగా దీనికి గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ కాంగ్రెస్ లీడర్ భద్రినాథ్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో స్థానిక మహిళలు విజయలక్ష్మీ, భాగ్య, శ్యామల, సునీత, సురేఖ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్

## ప్రెసిడెంట్‌గా రామరాజు వర్మ



నియామకపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్‌గౌడ్, రమ, చక్రధర్

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రామరాజు వర్మ నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం, చంద్రశేఖర్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి సమస్యలపై సంఘటిత పోరాటం చేయాలని పిలుపురిచ్చారు. ప్రతి బిసిఉద్యోగి సంఘం సభ్యులుగా చేరి ఈనెలలో నిర్వహించబోయే మెంబర్‌షిప్‌డ్రైవ్‌లో పాల్గొని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మహిళా అధ్యక్షులు డి.రమ, ఉపాధ్యక్షులు చక్రధర్, ఖమ్మం జిల్లా ఇంచార్జ్ మహేంద్రసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## తలసానికి అభినందనలు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సంకేత్ సంస్థ ప్రతినిధులు

కంటోన్మెంట్, డిసెంబర్ 11 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే సంకేత్ సంస్థకు ఎల్లప్పుడు తనవంతు ససహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్‌నగర్ ఎమ్మెల్యేగా బారీ మెజార్టీతో విజయం సాధించినందుకు సోమవారం ఆ సంస్థ ప్రతినిధులు మంత్రి తలసానికి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంకేత్ ప్రతినిధులు మురళీ, ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్బంగా శెట్టి బలిజ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఓం నమశివాయత్ పాటలో శివపార్వతుల నృత్యం చేస్తున్న నృత్య గురువులు శిరీషా, అశ్వినిరవివర్మ

## వైభవంగా బాలసాహితీ పురస్కారాల ప్రదానం

నాంపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త : తెలంగాణ సారస్వత పరిషత్తు సహకారంతో బాలసాహిత్య పరిషత్, పుట్టగుంట బాలసాహితీ పీఠం సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంట, తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో పుట్టగుంట సురేశ్‌కుమార్ బాలసాహితీ పురస్కారం-2023 ప్రదానోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాంత బయోటెక్నిక్స్ అధినేత డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి విశిష్ట అతిథులు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, చొక్కాపు వెంకటరమణ, గరిపెల్లి అశోక్, పుట్టగుంట సూరజ్, శాంతిప్రబోధ, చీకోలు సుందరయ్య తదితరులతో కలిసి బాలసాహిత్యానికి విశేష కృషిచేస్తున్న చిలకలూరిపేట దార్ల బుజ్జిబాబు, సిద్దిపేట పెందోట వెంకటేశ్వర్లులను ఘనంగా సత్కరించి పుట్టగుంట సురేశ్ కుమార్ బాలసాహితీ పురస్కారం ప్రదానంచేసి పుట్టగుంట సురేశ్‌కుమార్, పరిషత్తు సాహిత్య సేవలను, ప్రోత్సహాన్ని కొనియాడారు.

## వైభవంగా పాఠశాల వార్షికోత్సవ ముగింపు వేడుకలు



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నిజాంపేట్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : కెన్నడి గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం సాయంత్రం ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థిని, విద్యార్థుల 19వ వార్షికోత్సవ జష్న్ సంబరాలు వైభవంగా ముగిసాయి. ఈ వేడుకలకు స్కూల్ చైర్మన్ ఎస్.జమలారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి పాజిటివ్ సైకాలజిస్ట్ ఇంటర్నేషనల్ హాస్పిటల్ స్పీకర్-హ్యాపీనెస్ వుమన్ ప్రొఫెసర్ జి.సి.కవిత ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాగ శనివారం సాయంత్రం ఘనంగా 19వ వార్షికోత్సవ వేడుకలు (వసుధైవ కుటుంబకం) అత్యంత ఆనందోత్సాహాలతో అంగరంగ వైభవంగా కెన్నడి రెసిడెన్షియల్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎమ్.సుబ్బారెడ్డి, డైరెక్టర్ డా.బి.సుధాకర్ రావు, ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీభట్ లు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ ఎస్.జె.రెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగత లేదా కుటుంబ ప్రయోజనాల కంటే సామూహిక శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే ఆలోచనా దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందిపచేయాలన్నారు. ముఖ్యంగా శాంతియుత ఆలోచనలతో స్థిరమైన అభివృద్ధిని సాధించే విధంగా ప్రత్సోహించాలన్నారు. సమస్యలను చూసి భయపడక పరిశీలించి, పరిష్కరించుకునే సామర్థ్యాన్ని ఏర్పరుస్తూ ఒకే భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు దిశగా పిల్లలను తీర్చిదిద్దాలనీ, ఇందుకు తల్లిదండ్రులు కూడా కొంత సమయాన్ని వారి పిల్లల కోసం కేటాయిస్తూ వారి మనోభావాలను గ్రహించాలనీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి వాత్సల్యపూర్వక వాతావరణాన్ని కల్పిస్తూ విద్యార్థి ప్రగతికి తోడ్పాడాలని సూచించారు.

## మంత్రి ఉత్తమ్‌రెడ్డిని కలిసిన నాయకులు



కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 11, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్ కుమర్ రెడ్డిని కూకట్‌పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ళ నాగిరెడ్డి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని నాగిరెడి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎడ్ల మోహన్‌రెడ్డి, చందిరి కొండల్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి మహాపడి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బేగంబజార్, డిసెంబర్ 11ప్రభాతవార్త: భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి ఆద్వర్యంలో ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజ అంగరంగ వైభవంగా కొనసాగింది. శబరిమలై తరహాల్లోనే 18అడుగులతో సామూహిక అయ్యప్ప స్వామి మహాపడి పూజను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మహాపడి పూజ కార్యక్రమాన్ని శబరిమలై ఆలయ ప్రధాన మెల్ శాంతి పూజారి విష్ణు నంబూత్రి చేతుల మీదుగా వేద మంత్రోత్చరణ చేశారు. ఈ పూజ కార్యక్రమంలో గోషామహాల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్, స్టాప్స్ అండ్ రిజిస్ట్రేషన్ జనరల్ జాయింట్ ఐజి శ్రీనివాసులు. డిఐజి సుమతి, సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ శైలజా, ప్రమోదా తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బండి అపర్ణ, బాస్ సలహాదారులు దేవర రాజేశ్వర్, కట్టమల్లేశం, కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్, రాకేష్‌జైస్వాల్, ప్రముఖ వ్యాపారవేత్త వీరేందర్‌సింఘాల్ తదితరులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బాస్ అధ్యక్షులు క్యాతం రాధాకృష్ణ గురుస్వామి పర్యవేక్షణలో పూజలు జరిగాయి. రాకేష్, విజయ్ బాస్కర్ వేలాదిమంది అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

## బాగ్‌లింగంపల్లి అంబేద్కర్ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

చిక్కడపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త: బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే ప్రాజెక్ట్ ఎక్స్‌పో కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు 100 అంశాల్లో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమమైనవిగా కొన్నింటినిలో భాగంగా వైర్లెస్ డిజిటల్ బోర్డు, ఆపరేటర్ మోడల్ ట్రీ, ఇస్రో చంద్రయాన్ ఎంపిక చేసిన మోడల్స్‌కు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి నగదు బహుతమలును ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకుగాను అందించారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి పి.వి.రమణకుమార్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ గీతాలాపన కార్యక్రమంతో కార్యక్రమం ముగిసింది.



## బయటకు వెళ్లిన యువతి అదృశ్యం

ముషీరాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన యువతి అదృశ్యం అయిన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో నివసించే సుజ్జన్‌లాల్, సావిత్రి అనే దంపతులకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మూడవ కుమార్తె అర్చన (18) ఇళ్లల్లో పని చేస్తూ ఉండేది. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీ సాయంత్రం సుష్మ వాళ్ల ఇంట్లో పనిచేసేందుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లింది. పనికి వెళ్లిన అర్చన ఎంతకూ ఇంటికి తిరిగి రాకపోగా, పనికి కూడా సుష్మ ఇంటికి రాలేదని తెలిసింది. కుటుంబ సభ్యులు దోమలగూడ పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

## రేపు, ఎల్లుండి పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త : హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై మూడవ దశలో కోదండాపూర్ పంపింగ్ స్టేషన్ వద్ద 2375 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్ హైదర్‌పైపుకు భారీ లీకేజీ ఏర్పడింది. ఈ లీకేజీని అరికట్టేందుకు మరమత్తు పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 13 బుధవారం ఉదయం 5గంటల నుంచి మరుసటి రోజు 14వ తేది గురువారం ఉదయం 5గంటల వరకు మరమత్తు పనులు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాలలో నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి అధికారులు తెలిపారు. శాస్త్రిపురం(ఓ అండ్ ఎ డివిజన్-1), బండ్లగూడ (ఓ అండ్ ఎ డివిజన్-2), బోజగుట్ట, షేక్‌పేట (ఓ అండ్ ఎ డివిజన్-3), ఆళ్లబండ(ఓ అండ్ ఎ డివిజన్-4), జుబ్లిహిల్స్, ఫిల్మనగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా(ఓ అండ్ ఎ డివిజన్-6), లాలాపేట పాక్షిత ప్రాంతాలు(ఓ అండ్ ఎ డివిజన్-7), సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవి రిజర్వాయర్(ఓ అండ్ ఎ డివిజన్-10), సైకిన్‌పురి మౌలాలి (ఓ అండ్ ఎ డివిజన్-13), స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్రనగర్(ఓ అండ్ ఎ డివిజన్-14), గచ్చిబౌలి, మదాపూర్, అయ్యప్పసొసైటీ(ఓ అండ్ ఎ డివిజన్-15), మధుబన్, దుర్గానర్, బుద్వేల్, సులేమాన్‌నగర్, గొల్డెన్ హైట్స్ 9 నెంబర్(ఓ అండ్ ఎ డివిజన్-16), కిస్మత్‌పురం, గంధం గూడ (ఓ అండ్ ఎ డివిజన్-18), బోడుప్పల్, మల్లిఖార్జుననగర్, మానిక్‌చంద్, చెంగిచర్ల, భరత్‌నగర్, ఫిర్యాదిగూడ (ఓ అండ్ ఎ డివిజన్-19), ధర్మసాయి(ఓ అండ్ ఎ డివిజన్-20), ప్రాంతాలలో నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి అభినందనలు తెలిపిన సగర మహిళా సంఘం




కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 11, ప్రభాతవార్త : శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా అరికెపూడి గాంధీ హాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా జగద్గిరిగుట్ట సగర మహిళా సంఘం సభ్యులు ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు ఆధ్వర్యంలో సగర మహిళా సంఘం బిఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు కాలనీ అసోసియేషన్ సభ్యులు కలిసి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ నామీద విశ్వాసం ఉంచి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో నన్ను గెలిపించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, శేరిలింగంపల్లి ప్రజానీకానికి ఎల్లవేళల ఋణపడి ఉంటానని, నన్ను వెన్నంటి నడిపించిన కెసిఆర్‌కి, కెటిఆర్‌కి బిఆర్‌ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, కార్పొరేటర్లకు, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, ఉద్యమకారులకు, కార్యకర్తలకు, అభిమానులకు, కాలనీ అసోసియేషన్ సభ్యులకు అందరికీ పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు సంజీవరెడ్డి, సగర మహిళ సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్షులు తిరుపతమ్మ సాగర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. శాంత సాగర్, కుసుమ సగర, జ్యోతి సగర, అలివేలు సగర, మంజుల సగరతో పాటుగా జగద్గిరిగుట్ట సగర సంఘం అధ్యక్షులు దయాసాగర్, ప్రధాన కార్యదర్శి అస్కాని శ్రీనివాస్ సాగర్, కెపి రాములు సాగర్, రామ్ సాగర్, కొండయ్య సాగర్, రామకృష్ణ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనిషి గడ్డం ప్రసాద్ కుమార్

### అభినందించిన ఫిలిం ఛాంబర్ బృందం



ఫిల్మ్‌నగర్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : ఎమ్మెల్యే, మాజీ మంత్రి గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఫిల్మ్ ఛాంబర్ కార్యవర్గ సభ్యుల బృందం, పట్టభద్రుల జేఏసీ, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా గడ్డం ప్రసాద్ కుమార్‌ను శాలువాతో సత్కరించి పూలబొకె అందజేసి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు, పట్టభద్రుల జేఏసీ గౌరవ అధ్యక్షులు ప్రముఖ నిర్మాత గొట్టుముక్కల పాండురంగరావు, టిఎస్‌ఎఫ్‌సిసి కార్యవర్గ సభ్యులు, దర్శకుడు, కథా రచయిత పులి అమృత్‌గౌడ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరంతరం ప్రజల సేవలో ఉండే ప్రజల మనిషి గడ్డం ప్రసాద్ కుమార్ స్పీకర్ కాబోతున్నందుకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు ప్రసాద్ కుమార్ అధిరోహించాలని ఈ సందర్భంగా ఉప్ప సత్యనారాయణ బృందం ఆకాంక్షించారు. ఇంటలెక్చువల్ నేషనల్ ఫోరం చైర్మన్ ఆరేపల్లి రాజేందర్ మాట్లాడుతూ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు సజావుగా నడుస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్వచ్ఛంద సంస్థ పిసీ లక్ష్మయ్య ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పిసి లక్ష్మణ్, బోనం వీరబాబు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దర్శనంలో పాల్గొన్న కాలేరు



హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త: కార్తికమాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శ్రీశైలం భ్రమరాంభిక మల్లికార్జున స్వామి వారి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రవీందర్‌రావు, మధుసూధన్‌రెడ్డి, లింగారావు, మల్లేష్‌యాదవ్, శ్రీరాములుముదిరాజ్, అరుణ్‌కుమార్‌రెడ్డి, మహేష్‌ముదిరాజ్, రమేష్‌నాయక్, తిరుపతి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ హాట్రిక్ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు వెల్లువ

పేట్ బషీరాబాద్, డిసెంబర్ 11, ప్రభాతవార్త : యువ నాయకులు, విద్యావంతుడు, హాట్రిక్ ఎమ్మెల్యే కెపి వివేకానందకు శుభాకాంక్షలు తెలిపేందుకు కుత్బుల్లాపూర్‌కి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్దకు చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నేను ఎన్నడూ మర్చిపోని విధంగా ఇంతటి అఖండ విజయాన్ని అందించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.



నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## నేత్రపర్వంగా ఉమామహేశ్వరస్వామి కల్యాణోత్సవం



చిక్కడపల్లి డిసెంబరు 11 ప్రభాతవార్త: భక్తులు తిలకిస్తుండగా, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని పవిత్రమైన శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో ఉమామహేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. కారీక మాసోత్సవాలను పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయం ఈవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మాసశివరాత్రి సందర్భంగా ఘృత శర్కరాభిషేకం కార్యక్రమం జరిగింది. సాయంత్రం ఆరుగంటలకు ఉమామహేశ్వరస్వామివారి కల్యాణం ఉంటుందని ఈఓ వివరించారు. అంతకుముందు ఆలయంలో బిల్వార్చన, అన్నపూజ, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. కాగా 12న మహాన్యాసం ప్రారంభం అవుతుందని ఈవో వివరించారు. కార్యక్రమంలో కాశీనాథ్‌శర్మ, బుచ్చమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహానటి సావిత్రి 87వ జయంతి

చిక్కడపల్లి, డిసెంబరు 11 ప్రభాతవార్త: తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని పాత్రలు సావిత్రిని వెతుక్కుంటూ వచ్చాయని తానా పూర్వ అధ్యక్షుడు కోమటి జయరామ్ అన్నారు. ఎటువంటి క్లిష్ట పాత్రలనైనా అవలీలగా జీవించగల సావిత్రి ఇప్పటికే తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. కలవెండి ఫౌండేషన్ అధినేత కెఎస్.మూర్తి సమన్వయంతో మహానటి సావిత్రి 87వ జయంతి కార్యక్రమం మిరిపిటాస్(అమెరికా)లో బాటా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి నటించిన చిత్రాలపై 80 మంది రచయితలు రచయిత్రులు రాసిన విశ్లేషనాత్మక వ్యాసాల సంపుటి 'సహజ నటనాభినేత్రి సావిత్రి' సంపుటిని జయరామ్ ఆవిష్కరించి ప్రసంగించారు. బాటా అధ్యక్ష, ఉపాధ్యక్షుడు కొండల్ కొమరగిరి, కె.శివ, కార్యదర్శి వరుణ్ ముక్క, సహాయ కార్యదర్శులు హరి సన్నిది, కమిటీ సభ్యులు రవితిరుపీదుల, కామేశ్ మల్లా, శిరీష బత్తుల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు మధురంగా గానం చేశారు.

## కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్



మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నాచారం, డిసెంబర్ 11 ప్రభాతవార్త: సికింద్రాబాద్ యశోధ హాస్పిటల్లో చికిత్సపొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యపరిస్థితిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాజీ మంత్రి కేటీఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వెళ్లిన బిఎల్ఆర్ కేసీఆర్‌ను పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యం త్వరితగతిన మెరుగుపడాలని భగవంతుడిని వేడుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మాజీ కోర్పోరేటర్లు సాయిజన్ శేఖర్, కొత్తరామారావు, మహేష్ గౌడ్ తధితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి అభినందనలు

కంటోన్మెంట్, డిసెంబర్ 11 ప్రభాతవార్త: మల్కాజిగిరి ఎమ్మెల్యేగా విజయం సాధించిన మర్రి రాజశేఖర్ రెడ్డిని శనివారం బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో మార్కెట్ డైరెక్టర్ బత్తుల నారాయణ, మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్ సి.సంతోష్ యాదవ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

## 19నుంచి 21 వరకు ఎగ్జిబిషన్

హైదరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త: ఈనెల 19నుంచి 21వరకు హైటెక్‌సిటీలోని హెచ్ఐసిసి నోవాటెల్‌లో హైలైఫ్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ నటి స్రవంతి చొక్కారపుతోసహా పలువురు మోడల్స్ సందడి చేసి వస్త్రప్రదర్శన పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు డిజైన్ చేసిన సరికొత్త వస్త్రాలను పరిచయం చేస్తూ ..ప్రదర్శించిన ఫ్యాషన్‌షో అద్యంతం అలరించింది. మూడురోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా పేరొందిన ప్రముఖ డిజైనర్లు తమ ఉత్పత్తులను నగరవాసులకు పరిచయం చేయనున్నారు.

## ఘనంగా స్కూల్ వార్షికోత్సవ వేడుకలు




పోటీలల్లో గెలుపొందిన విద్యార్థికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

నాచారం, డిసెంబర్ 11 ప్రభాతవార్త: పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో స్కూల్ ఆవరణ సందడిగా మారింది. విద్యార్థుల ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్లవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు, డీపీఎస్ చైర్మన్ మల్కా కొమురయ్య హాజరై క్రీడలు, ఆటపాటల్లో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు తమ స్కూల్లో క్రీడలు, వివిద సాంస్రృతిక కార్యక్రమాలతో రాణించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు తాము కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రిన్సిపల్ హేమ మాడభూషి ఆమె బృందంతో స్కూల్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వేద యుగం నుంచి నేటి జాతీయ విద్యా విధానం నుంచి ఇప్పటి వరకు మారిన విద్యా వ్యవస్థ విధానాన్ని ఆధారంగా చేసుకొని ప్రదర్శన ఉంటుంద న్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మన దేశానికి చెందిన సొంత శాస్త్రవేత్తలను తయారు చేసిన రాకెట్లు, వాక్సిన్స్‌లను నాటకీయంగా ఎంతో చక్కగా చూపించి ఆకట్టుకున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ ఎంజే అక్బర్, సింగర్ ప్రణతి, వైస్ ప్రిన్సిపల్ మీనుతో ఎవిద్యార్థుల తల్లి, తండ్రులు పాల్గొన్నారు.



బస్వాపూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం

## పొన్నంకు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

**కోహెడ, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా హుస్నాబాద్‌కు రావడంతో మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామ శివారులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మ అధ్వర్యంలో డప్పు చప్పుళ్లతో గిరిజనుల నృత్యాలతో స్వాగతం పలికి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. బస్వాపూర్ నుండి అరెపల్లి మీదుగా కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరారు. అంతకు ముందు బస్వాపూర్‌లో అంబేద్కర్‌విగ్రహానికి, సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంజులరెడ్డి, శెట్టి సుధాకర్, బందెల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

**బెజ్జంకిలో...**

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సోమవారం జిల్లాకు మొదటి సారిగా విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనం సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఒగ్గు దామోదర్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, రవి, శ్రీకాంత్, పోచయ్య, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కొండపాకలో...**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**కొండపాక, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయన్ని ప్రారంభించడానికి రవాణా శాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డితో కలిసి సోమవారం హైదరాబాద్ నుండి సిద్దిపేట వస్తున్న క్రమంలో రాజీవ్ రహదారి పై కుకునూరుపల్లిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో కొంతసేపు అగి కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం దుద్దెడ టోల్ గేట్ వద్ద కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు మంత్రికి మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. డిసిసి అధ్యక్షుడు నర్సా రెడ్డి మంత్రికి కార్యకర్తలను పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రతాప్ చందర్, నర్సింహ్మాచారి, పంబాల సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రుల మల్లేశం, మల్లికార్జున్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈటలే

**-మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్**



మాట్లాడుతున్న గాడిపల్లి భాస్కర్

**గజ్వేల్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఇన్‌ఛార్జిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఉంటారని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో బిజెపి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ గజ్వేల్ నియోజకవర్గంలో కేవలం 28రోజులు మాత్రమే ఎన్నికల ప్రచారం నిర్వహించారని, అతికొద్ది సమయంలోనే 64 వేలకు పైగా ఓట్లు రావడం ఆషామాషి కాదన్నారు. బిజెపి గతంలో కన్నా పదిరెట్లు పుంజుకుందని, రానున్న రోజుల్లో గజ్వేల్ నియోజకవర్గం నుండి ఈటల రాజేందర్ ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రాబోయే రోజుల్లో జాతీయ పార్టీలకే మనుగడ ఉంటుందని, చిన్నా చితకా పార్టీల పాలన కష్టసాధ్యమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపి సీట్లను బిజెపి కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జశ్వంత్‌రెడ్డి, మల్లం రాజు, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, రాజిరెడ్డి, బిక్షపతి, భాస్కర్‌రెడ్డి, సింగం సత్తయ్య, రాంచంద్రారెడ్డి, సుభాష్ చంద్రబోస్, రాంచంద్రాచారి, ఎక్బాల్, మల్లేశం, సురేష్‌గౌడ్, రాందాస్ గౌడ్, అమృతరెడ్డి, గుమ్మడి శ్రీనివాస్, నాగుముదిరాజ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

## చిన్న జంతువుల నిర్వహణపై కార్యశాల

**పటాన్‌చెరు, నవంబర్ 11,ప్రభాతవార్త:** ప్రయోగశాలలో ఎలుకలు, చుందులు వంటి జంతువుల నిర్వహణ వాటితో వ్యవహరించే తీరుని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఈ నెల 20-21 తేదిలలో కార్యాశాలను నిర్వహించనున్నారు. లాబోరేటరీ యానిమల్ సెంటిస్ట్స్ అసోసియేషన్ (ఇండియా) ఐసీపీ స్టూడెంట్స్ ఫోరమ్ కలిసి దీనిని ఏర్పాటు చేస్తున్నారు. బయోమెడికల్ పరిశోధనలో ఉపయోగించే చిన్న జంతువుల నిర్వహణ ప్రాథమిక పద్ధతులపై ఇందులో పాల్గొనే వారికి అవగాహన కల్పించడం ఈ కార్యశాల లక్ష్యం. అంతే గాక జంతువుల లింగ నిర్ధారణ, నియంత్రన వంటి నైపుణ్యాలను నేర్చుకునే వీలుంటుంది. ద్రవం ఉపసంహరణ, డ్రగ్ టెస్ట్ కాంపౌండ్ నిర్వహణకు సంబంధించిన మెళకువలను నేర్చుకుంటారు. ఆయా అంశాలపై నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలతో సదస్సులు, ముఖాముఖి చర్చించే అవకాశం ఉంటుంది. హైదరబాద్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ మెడికల్ సెన్సైస్ డీన్ డాక్టర్ ప్రకాష్ బాబు ఫణితి ఈ కార్యశాలలో ముఖ్య అతిధిగా పాల్గొని క్యాన్సర్ చికిత్స కోసం ఔషద ఆవిష్కరణలో ఆధునిక పోకడలు అనే అంశంపై ప్రసంగిస్తారు. హైదరబాదులోని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.జెరాల్డ్ మహేష్ కుమార్, హైదరబాద్‌లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్ హరిశంకర్ ప్రధాన వక్తలుగా పాల్గొంటారు. ఈ కార్యశాలలో లైఫ్ సెన్సైస్, ఫార్మసీ రంగంలో పరిశోధనలు చేసే వారితో పాటు ఫార్మసీ, బయాలజీ మెడికల్ సెన్సైస్ విద్యార్థులు కూడ పాల్గొనవచ్చు. ఇందులోపాల్గొనేవారు ఆయా రంగంలో వారి అవగాహన, నైపుణ్యాలను పెంపొందించే విలువైన అంతర్గత, అవతరాణత్మక, నైపుణ్యాలను పొందుతారు. ఈ వర్క్షా పాల్గొనలనే ఆసక్తిగల వ్యక్తులు తమ పేర్ల నమోదు,రుసుము వంటి మరిన్ని వివరాల కోసం డాక్టర్ ఎం.వినయ్‌ని 994912037లో సంప్రదించాలని వారు తెలిపారు.

## మున్సిపల్ సమావేశానికి అధికారులు హాజరుకావాలి

**కొడంగల్,డిసెంబర్ 11ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 14న నిర్వహిస్తున్న మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించ నున్నట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతు పట్టణంలోని మం జునాథ మినీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న సమావేశంలో కొడం గల్ అభివృద్ధి భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలపై చర్చిం చేందుకు నిర్వహిస్తున్న అతి ముఖ్య సమావేశానికి అన్ని శాఖల హెచ్‌ఓడి అధికారులు విధిగా హజరుకావాలని తెలిపారు. అంతే గాక మున్సిపల్ పరిధిలో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిప ల్ కోఅప్షన్ సభ్యులు మునీర్, డీడీఎస్‌ఎస్ జిల్లా అద్యక్షులు లోకూర్తి జయతీర్ధాచారి, మున్సిపల్ కమీషనర్ ప్రవీణ్‌కుమా ర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి పాటుపడతా

**మొదటి బడ్జెట్‌లోనే గౌరవెల్లి ప్రాజెక్టుకు రూ. 250 కోట్లు కేటాయిస్తాం...**
**ప్రియాంకగాంధీ ఇచ్చిన హామీ మేరకు మెడికల్ తీసుకొస్తాం...**
**రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్**

**హుస్నాబాద్, డిసెంబరు 11,ప్రభాతవార్త**

నా ప్రాణం పోయేవరకు హుస్నాబాద్ ప్రాంతం అభివృద్ధికి పాటుపడుతానని, హుస్నాబాద్ అంటే సెంటిమెంట్ కాదని అభివృద్ధి అంటే ఏంటో రుచి చూపిస్తానని రాష్ట్ర రవాణాశాఖ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రకటించారు. సోమవారం రాత్రి హుస్నాబాద్ శాసనసభ్యునిగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంత్రివర్గంలో చోటు సంపాదించి ప్రమాణస్వీకారం చేసిన అనంతరం నియోజకవర్గానికి ఆయిన హుస్నాబాద్‌కు మొదటి సారిగా విచ్చేసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కోహెడ మండలం బస్వాపూర్ గ్రామం నుండి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లి భారీప్రదర్శన మధ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఇందిరాగాంధీ మనవరాలు ప్రియాంకగాంధీ ప్రజలకుఇచ్చిన హామీ మేరకు మెడికల్ కళాశాలను తీసువచ్చే బాద్యత నాదేనన్నారు. వచ్చే మొదటి బడ్జెట్ సమావేశంలోనే ఈ ప్రాంత రైతాంగం ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు నిధులు 250కోట్లు కేటాయించాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇదివరకే లేఖ రాసినట్లు తెలిపారు. ఖచ్చితంగా మొదటి విడుత లోనే నిధులు తీసుకొచ్చి నిర్వాసితుల సహకారంతో ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పని చేస్తానని, అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. నియోజకవర్గాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా మారుస్తానని, మీరు ఇచ్చే ప్రతి వినతిపత్రానికి నేనే సమాధానం అవుతాని ప్రకటించారు. ఈ ప్రాంత శాసనసభ్యునిగా ఈ నియోజకవర్గం అభివృద్ధితో పాటు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటున్నాని వెల్లడించారు. ఇక మాటలు చెప్పనని చేతల్లో చేసి చూపిస్తానన్నారు. తనను శాసనసభ్యునిగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తానని, ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తూముకుంట నర్సా రెడ్డి, డిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో , చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ రవిందర్, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సామాజిక సేవకురాలు, కాంగ్రెస్ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బంక చందు, నాయకులు అక్కు శ్రీనివాస్, మైదంశెట్టి వీరన్న, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న లావణ్యసది, సిపిఐ నాయకులు గడిపె మల్లేష్, జేరిపోతుల జనార్ధన్, జనగామ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్, హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు



రామలింగేశ్వర సా ్వమికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

## భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

**దుబ్బాక(అక ్బరేపేటభూంపల్లి), డిసెంబర్ 11, ప్రభాతవార్త :** కార్తీక మాస ం చివరి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో శివలాయాలకు తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలో రామేశ్వరంపల్లి గ్రామంలో శ్రీ రామలింగేశ్వర అలయంలో రామలింగేశ్వర స్వామికి అలాగే చౌదర్‌పల్లి గ్రామంలో దుబ్బారాజేశ్వర స్వామిలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు. కార్యక్రమంలో అలయ పూజారులు సాంకేత్ శర్మ, భాను ప్రసాద్ శర్మ, అలయ ఛైర్మన్ చంద్రం, పొతనక సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వారి రెండు నెలల ఆదాయం రూ.69 లక్షలు



స్వామి వారి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త:** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. స్వామి వారి 60 రోజుల ఆదాయం రూ. 69,08,932 రాగా బంగారం 20 గ్రాములు, వెండి 6.500 గ్రాములు, బియ్యం 600 క్వింటాళ్లు, 12 విదేశీనోట్లు వచ్చాయి. కార్యక్రమంలో ఈవో బాలాజీ, ఏఇవో అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్, అలయ సిబ్బంది, అర్చకులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు

**కొడంగల్,డిసెంబర్ 11ప్రభాతవార్త**

కార్తీక మాసంతో పాటు మాసశిరాత్రిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీమహదేవుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం ఒంటి గంట వరకు ఆలయ భజన మండలి అద్వర్యంలో లింగాష్టక పారాయణం, అనంతరం శివలింగానికి పంచామృతాభిషేకం, శివ అష్టోత్తర శతనామావళి, దూప దీపనైవేద్యాలను సమర్పిస్తు మంగళహరతులు అందించారు. ఆలయ అవరణలో ఉసిర, వేప, ర్యాల, మారేడు బిల్ల వృక్షాలకు దీపాలు వెలిగించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు ఆల య అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్తీకమాసం, సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## స్వామివారిని దర్శించుకున్న జనగామ ఎమ్మెల్యే



స్వామి వారిని దర్శించు కుంటున్న జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

**కొమురవెల్లి, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామిని జనగామ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జనవరి 7న శ్రీ స్వామివారి కళ్యాణం సందర్భంగా దేవాలయ అధికారులతో త్వరలోనే సమీక్షా సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి గెలిపించిన జనగామ నియోజకవర్గం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేకు దేవాలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈవో బాలాజీ, ఏఈవో అంజయ్య, ప్రధాన అర్చకులు మల్లికార్జున్, అలయ అర్చకులు, సిబ్బంది, మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

**రాయపోల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త :** పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఆరుగురిని అదుపులోకి తీసుకున్న సంఘటన రాయపోల్ మండల పరిధిలోని ఎల్కల్ గ్రామంలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్కల్ గ్రామానికి చెందిన రాంచందర్‌గౌడ్ ఇంటి వాకిట్లో ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆరుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 1200 రూపాయల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## తాటిగడ్డ తండాలో గేదె దూడలపై హైనా పంజా

**నందిగామ డిసెంబరు12,ప్రభాతవార్త :** మొన్న కొత్తూరు, నిన్న నందిగామ మండలంలో హైనా అనే క్రూర జంతువు సంచరించడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నందిగామ మండలం తాటిగడ్డ తండాలో ఆదివారం రాత్రి తండా రెండవ వార్డు సభ్యుడు జెటావత్ గణేష్ నాయ క్ వ్యవసాయ పొలంలో పశువుల కోటంలో కట్టేసి ఉంచిన రెండు గేదె దూడలపై పంజా విసరడంతో ఒకటి మృతి చెందగా మరొకటి చావు బతుకుల మధ్య కొట్టు మిట్టాడుతుంది. ఈ సంఘటనతో చుట్టపక్కల గ్రామాల రైతులు గిరిజనులు భ యం గుప్పెట్లో గడుపుతున్నారు. సంఘటన సమాచారం తెలిసిన షాద్‌నగర్ డివి జన ఎఫ్ఎస్ఓ రవీందర్ గౌడ్, ఆమనగల్ రేంజ్ షాద్‌నగర్ డివిజన్ బిటీ అధికారి ఎంఏ అజీజ్, నందిగామ ఎస్ఐ కొండలరావులు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన ఘటనపై ఆరా తీశారు. నక్కలా పులి చేరాలు కలిగి ఉండే హైనా పనే అయి ఉంటుందని అధికారులు తేల్చి చెప్పారు. ఏది ఏమైనా చనిపోయిన గేదె దూ డను పోస్టుమర్టం నిర్వహించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

# రైతులు వెళ్లే దారిలో ఇష్టారాజ్యంగా చెత్త డంప్

◆ ప్లాస్టిక్ తిని పశువులు, దుర్వాసనతో రోగాల పాలవుతున్న రైతులు ◆ పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**చేర్యాల, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**

చేర్యాల పట్టణ (పెద్దమ్మగడ్డ) శివారులో ఏర్పాటు చేసిన శ్మశానవాటిక, చెత్త డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల రైతులకు శాపంగా మారింది. పట్టణంలో రోజూ సేకరించిన చెత్తను మున్సిపాలిటీ సిబ్బంది వాహనాల్లో తీసుకొచ్చి డంపింగ్ యార్డ్ ప్రహరీ లోపల వేయకుండా ఇష్టారాజ్యంగా బయటే డంపుచేసి వెళ్లడంతో చెత్త దుర్వాసన వల్ల అటుగా వెళ్లే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చుట్టుపక్కల రైతులు ఆరోపిస్తున్నారు. ఈ డంపింగ్ యార్డ్ ముందు నుంచే అనేక మంది రైతులు వ్యవసాయ భూముల వద్దకు వెళుతుంటారు. అయితే మున్సిపాలిటీ సిబ్బంది చెత్తను తీసుకొచ్చి రైతులు వెళ్లేదారిలో అడ్డుగా వేయడంతో రాకపోకలకు ఇబ్బంది కలగడమే కాకుండా దుర్గంధం వెదజల్లడంతో అనారోగ్యాల పాలవుతున్నామని అక్కడి రైతులు మున్సిపల్ అధికారుల, సిబ్బందిపై మండిపడుతున్నారు. ఇక్కడ చెత్తడంపింగ్ చేస్తున్నప్పటి నుండి పశువులు ప్లాస్టిక్ కవర్లను, చెత్తాచెదారాన్ని తిని రోగాల బారిన పడుతున్నాయన్నారు. ఇప్పటికైన డంపింగ్‌యార్డ్ పక్కన ఉన్న రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని, లేదంటే కార్యాలయం ముందు నిరసన, ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు.



రైతులు వెళ్లే దారిలో ఇష్టారాజ్యంగా డంప్‌చేసిన చెత్తా,చెదారం



విజయ్‌భాస్కర్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

## ఆత్మహత్యాయత్నం చేసుకున్న అభిమానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**హుస్నాబాద్, డిసెబరు 11, ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఎన్నికల్లో ఓటమి చెందడంతో మనస్థాపానికి గురైన అభిమాని కూతాటి విజయ్‌భాస్కర్ ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ నేపధ్యంలో సోమవారం సతీష్‌కుమార్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి అతడి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని గెలుపుతో సంబంధం లేకుండా తనను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని ధైర్యం చెప్పారు. తన ఓటమి పట్ల ఎవరూ కలత చెందవద్దన్నారు. పరామర్శించిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, ఎంపిపి లకావత్ మానససుభాష్, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు వాహబ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్నకు ఘన నివాళి



బొమ్మ వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**హుస్నాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** అజాత శతృవు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. సోమవారం ఆయన జయంతి వేడుకలను పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. మెట్ట ప్రాంత రైతాంగానికి సాగు నీటిని అందించాలని గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి వరద కాలువలు, హుస్నాబాద్‌లో కోర్టు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రావడంలో ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. బొమ్మ వెంకన్న చేసిన అభివృద్ధి పనులు ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, పిసిసి సభ్యులు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డిసిసి మెంబర్ చిత్తారి రవీందర్, అక్కన్నపేట సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి ,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వాహబ్ అన్వర్, కాంగ్రెస్ నాయకులు అక్కు శ్రీనివాస్, తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని మునిగడప కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సైదులు అన్నారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలం తీగుల్ ప్రాథమికపాఠశాలకు సికింద్రాబాద్‌కు చెందిన లింగ హరీష్‌గాంధీ తండ్రి లక్ష్మయ్య జ్ఞాపకార్థం బెంచీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం దాతను ఉపాధ్యాయుల శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్తయ్య, లయన్స్‌క్లబ్ ఈస్ట్ మారేడ్‌పల్లి సభ్యులు సుంకి ప్రకాష్, స్వరాజ్, మేకలమండి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, సంతోషి మాత, నందిని, అమృతమ్మ, స్వాతి, నవిత, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, నాయకులు దయానందరెడ్డి, మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ కుడుదుల పరశురాం పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు కింద పడి మహిళ మృతి

**హుస్నాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** ఆర్టీసీ బస్సు కింద పడి మహిళ మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం నందారం గ్రామంలో జరిగింది. సోమవారం నందారం గ్రామానికి చెందిన భూక్య లక్ష్మి కుమారుడు, కోడలు హైదరాబాద్ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు(టిఎస్36జడ్0022) ఎక్కారు. అంతకుముందు లక్ష్మి మనవడు నానమ్మ డబ్బులు ఇవ్వాలని మారం చేశాడు. దీంతో బస్సు ఎక్కిన మనవడికి డబ్బులు ఇచ్చే ప్రయత్నంలో బస్సు వెనకాల టైరుకింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకు న్నాయి. ఘటన స్థలానికి చేరకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చికిత్స పొందుతూ ఇద్దరు మృతి

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** కూలీల ఆటోను టాటా ఏసి వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామంలోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో కూలీ పనికి కొమురవెల్లి మండలం గుర్వన్నపేట గ్రామానికి చెందిన కూలీలు ఆదివారం వచ్చి తిరిగి వెళ్తుండగా మునిగడప గ్రామ సమీపంలో ఆటోను టాటా ఏసి వాహనం ఢీకొన్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో శిరీష (16), పుట్ట జయమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందగా మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గుర్రాల లక్ష్మి(62) మృతి చెందింది. అలాగే మెరుగైన వైద్యం కోసం దాసారం మల్లవ్వ(60)ని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వద్ధురాలి మృతి

**జహీరాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్దురాలు(70) మృతి చెందిన సంఘటన పట్టణ సమీపంలోని పాత ఆర్టీఓ చెక్ పోస్టు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ ఎస్ఐ కె శ్రీకాంత్ కథనం ప్రకారం... ఆర్టీఓ చెక్‌పోస్టు నుంచి బీదర్ వెళ్లే రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వృద్ధురాలిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు, కాలుకు బలమైన గాయాలయన్నారు. విషయం తెలుసుకుని క్షతగాత్రురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చినట్లు ఎస్ఐ శ్రీకాంత్ పేర్కన్నారు.

## జ్యూవెల్లరీ దుకాణంలో వెండి ఆభరణాలు అపహరణ

**గజ్వేల్, డిసెంబర్ 11 (ప్రభాతవార్త):** గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల జై భజరంగబలి జ్యూవెల్లరీ దుకాణానికి గుర్తు తెలియని వ్యక్తులు కన్నం వేశారు. వివరాలిలా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్‌లోని జెడ్‌పి హెచ్‌ఎస్ హైస్కూల్ పక్కన ఉన్న షట్టర్‌లో ముఖేష్ జ్యూవెల్లరీ దుకాణాన్ని నడిపిస్తున్నాడు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని ఇద్దరు దొంగలు దుకాణం వెనుక నుండి గోడకు కన్నం వేసి దుకాణంలో ఉన్న సుమారు 5 కిలోల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించగా సిఐ రంగకృష్ణగౌడ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించడంతో పాటు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. సిసి కెమెరాలో ఇద్దరు వ్యక్తులు దొంగతానికి పాల్పడినట్లు కనిపిస్తుందని త్వరలో వారిని పట్టుకుంటామని సిఐ రంగకృష్ణగౌడ్ తెలిపారు.



జ్యూవెల్లరీ దుకాణంలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తొగర్‌పల్లి బిఆర్ఎస్ నేతలు

## ఎమ్మెల్యేను సన్మానించిన బిఆర్ఎస్ నేతలు

కొండాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త: సంగారెడ్డి శాసన సభ్యులుగా ఎన్నికైన చింత ప్రభాకర్‌ను సోమవారం మండలంలోని తొగర్‌పల్లి గ్రామ బిఆర్ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. చింత ప్రభాకర్ నివాసానికి బిఆర్ఎస్ నేతలు చేరుకుని శాలవా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సోచయ్య, ప్రేమానందం, వార్డు సభ్యులు బాలరాజ్, కిరన్, వర కుమార్, రాములు, అశోక్, విజయరావు, గంగయ్య, పవన్, మాజీ వార్డు సభ్యులు ఆనంద్, చింటూ తదితరులు ఉన్నారు.

## ఘనంగా జ్ఞానేశ్వర్ మహారాజ్ పుణ్యతిథి

**నాగల్‌గిద్ద, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండలపరిధిలోని ముక్తాపూర్‌లో సోమవారం సంత్ జ్ఞానేశ్వర్ మహారాజనపుణ్యతిథిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుణ్యతిధిని పురస్కరించుకుని వారికరి భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. జ్ఞానేశ్వర్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి చేరుకున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## నగరేశ్వర దేవాలయంలో ఘనంగా మహా రుద్రాభిషేకం



అర్చకుడిని సన్మానిస్తున్న దృశ్యం

**రామాయంపేట, డిసెంబర్ 11, ప్రభాతవార్త :** శ్రీనగరేశ్వర దేవాలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని అర్చకుల ఆధ్వర్యంలో భక్తులు మహారుద్రాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు పబ్బా సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త నాగరాజు, డిబిఆర్ శంకరయ్య, చిగుళ్లపల్లి వెంకటేశం, కందుకూరి శ్రీనివాస్, చొల్లేటి రాజు భక్తులు పాల్గొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆర్టికల్ 370పై సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకమైంది



మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షులు కోనం విఠల్

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై సుప్రీం కోర్టు తాజాగా వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమైందని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోనం విఠల్ పేర్కొన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు వెలవరించిన తీర్పులో ఆర్టికల్ 370 రద్దు చేయడం అనేది కేంద్ర ప్రభుత్వం పరిధిలో తీసుకున్న నిర్ణయం అని తేల్చి చెప్పడంతో పాటు, పార్లమెంట్ నిర్ణయాన్ని కొట్టి పారేయలేమని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యులు బెంచ్ తీర్పు ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఆర్టికల్ 370 యుద్ధ నేపథ్యంలో కుదుర్చుకున్న తాత్కాలిక ఏర్పాటు మాత్రమే అని, జమ్ము కాశ్మీర్‌కు సార్వభౌమాధికారం లేదని, భారత రాజ్యాంగం ఫైనల్ అని స్పష్టం చేసిందన్నారు. సెప్టెంబర్ 30, 2024 లోగా జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, మంగళ కృష్ణ, బొగాల కృష్ణ పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌ల సమస్య పరిష్కరించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 11, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ రియాంబర్స్‌మెంట్, కరెంటు బిల్లులపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చర్చించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతి పత్రం అందచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 6 గ్యారంటీ పథకాలతో పాటు స్కాలర్ షిప్ పథకంపై ప్రత్యేకంగా చర్చించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. గత 3 సంవత్సరాలుగా విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందక తమ చదువులను మధ్యలోనే ఆపేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. వసతి గృహం మెస్ చార్జీలు విద్యార్థులకు సకాలంలో అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీను, కార్తీక్, ప్రశాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

**జోగిపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని అల్లాదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం అల్లాదుర్గం తహసీల్దార్ సతీష్‌కు విద్యార్థులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలపడం మూలంగా జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ప్రజలు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. మెదక్ జిల్లా హైద్రాబాద్‌కు సమీపంలో ఉందని, జోనల్ వ్యవస్థ ఏర్పాటులో జిల్లాను చార్మినార్‌జోన్‌లో కలిపితే జిల్లా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. విద్యారంగంలో జిల్లా చాలావెనుకబడి ఉందని వారు విచారం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు బంగారు బాటలో పయనించాలంటే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని వారు సూచించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న విద్యార్థులు

# పార్టీలకతీతంగా గ్రామాల అభివృద్ధి : ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, డిసెంబరు 11, ప్రభాతవార్త:** పార్టీలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఎంపిపి అధ్యక్షులు మోతీబాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలో వసతి గృహాలు, పాఠశాలలు,అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. మండల సర్వ సభ్య సమావేశానికి గైర్హాజరయిన అధికారులకు నోటీసులు జారీచేయాలని ఎంపిడి రాజశేఖర్ కవ్‌లాస్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యేగా తొలి మారు సమావేశంలోపాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని ఆయా శాఖల అధికారులు ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**ఆలయంలో ఎమ్మెల్యే పూజలు...**

నాగల్‌గిద్దలోని దత్తాత్రి దేవాలయానికి చేరుకున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డిని అర్చకులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాజశేఖర్ కవ్‌లాస్, జడ్పీటిసి రాజురాథోడ్, ఎంపిపి ఉపాధ్యక్షులు పండరియాదవ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు విఠల్‌రావు పాటిల్, సంజీవరెడ్డి, సునీత ప్రభాకర్‌రెడ్డి, అనిల్ పాటిల్, సంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మంత్రి పొన్న ప్రభాకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వైస్ ఎంపీపీ

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మహేష్‌రెడ్డి, కుకునూరు మాజీ సర్పంచి మల్లేశం ఉన్నారు.

## ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసిన బొమ్మారం సర్పంచి



ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామ సర్పంచి శంకర్‌తో పాటు గ్రామ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు వివరించినట్లు సర్పంచి శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన మాజీ ఎమ్మెల్యే

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** మండలంలోని దవ్వూర్ తండాకు చెందిన సరోజా బాయి అనారోగ్యంతో అవస్థలు పడుతుండటంతో మెరుగైన చికిత్స అందుకునేందుకు సోమవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి 60వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యులు సలీం, కంగ్టి మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు సంతోష్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి కృషి

**చిన్నశంకరంపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పోచయ్యను సోమవారం చిన్న శంకరంపేటలో ఆ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం అయిన సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలని, మెడికల్ బిల్లులు రాక ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చోరవ తిసుకొని ఉపాధ్యాయుల సమస్యలకు శాశ్వత పరిష్కరం చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, జబ్బర్, రతన్, శ్రీనివాస్, జహిరోద్దిన్, మహేష్, మాదవి, భవాని, శివ, కుమార్ తదితరులున్నారు.



పోచయ్యను సన్మానిస్తున్న జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి గొంగడితో సన్మానిస్తున్న రాష్ట్ర నాయకులు

## ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ఘనంగా సన్మానం

**నారాయణఖేడ్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** నూతనంగా ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టరు పట్లోళ్ల సంజీవరెడ్డికి ఘనంగా సన్మానించారు. సోమవారం నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే గృహంలో రాష్ట్ర గొర్రెల మేకల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి ఆధ్వర్యంలో గొల్లకుర్మ సంఘ నాయకులు బోకె గొల్ల కుర్మల వృత్తి గోంగడి,శాలువ పూలమలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బాపు మల్‌శెట్టి మాట్లాడుతూ నారాయణఖేడ్ ప్రాంతం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 1952 కాలం నుంచి కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని ఆయన గుర్తు చేశారు. నారాయణఖేడ్ ప్రాంతంలో కార్మికులకు నూతనంగా పరిశ్రమలు స్థాపించి ఉపాధి కల్పిస్తే బాగుటుందన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇస్తే నారాయణఖేడ్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నారాయణఖేడ్ నియోజకవర్గానికి ఎన్నికైన ఎమ్మెల్యే సంజీవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వలని నారాయణఖేడ్ ప్రాంత కాంగ్రెస్ నాయకులు కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది కిషన్‌రావు, గొర్రెల మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గోవింద్‌యాదవ్, గోవింద్‌నాయక్, సందడి సామేల్, వివిధ మండల గొల్లకుర్మ సంఘం అధ్యక్షులు దత్తుగోండ, బాబన్న, విఠల్, బాగయ్య, పండరి, భూంగోండ, తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలించిన ఎమ్మెల్యే



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, నవంబర్ 11, ప్రభాతవార్త:** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో 20 కోట్ల రుపాయలను అంచాన వ్యయంతో నిర్మిస్తున్న 160 దుకాణాల సముదాయం నిర్మాణ పనులను పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయితే.. ఇటు వ్యాపారస్తులకు అటు రైతులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ అశోక్, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆటోవాలాలను ఆదుకోవాలి

**చిన్నశంకరంపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేయడంతో ఆటోలో ఎవరూ ఎక్కడం లేదని, ప్రభుత్వం తమకు ప్రత్యామ్నాయ మార్గంచూపాలని గవ్వలపల్లి ఆటో యూనియన్ సభ్యులు కోరారు. సోమవారం ఆగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఆటోనే నమ్ముకొని జివిస్తున్నామని, మహిళలు ఎక్కకపోవడంతో నష్టపోతున్నామని, ఆటోకు ఫైనాన్స్‌లో ఎలా కట్టాలో అర్థం కావడం లేదని, వారు వాపోయారు. ప్రభుత్వం తనకు దారి చూపించాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు శ్రీనివాస్, నర్సింలు, కుమార్,సత్యనారాయణ, శివ తదితరులున్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఆటో యూనియన్ సభ్యులు

# విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:** విద్య, వైద్యరంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని నారాయఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఎంపిపి అధ్యక్షులు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటిస్తూ ఉంటారని సూచించారు. విద్య రంగం బాగుంటేనే సమాజం బాగుంటుందని గుర్తు చేశారు. అధికారులు ప్రజా ప్రతినిధులను గౌరవిస్తూ సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. దుదిగొండ సర్పంచ్ రాజు మాట్లాడుతూ గ్రామంలో తీర్మానం చేయకుండానే పనులు ఎలా నిర్వహిస్తారని పంచాయితీ రాజ్ ఏఈ బాల్‌లింగను నిలదీశారు. పిటిసి పెంటయ్య మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేగా మొదటి మారు మండల సభలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఎంపిపి అధ్యక్షురాలు కొంగరి జయశ్రీ మోహన్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు రాములు, ఎంపిడిఓ షాజులుద్దీన్, తహసీల్దార్ మల్లేష్ కుమార్, ఏఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈలు బాల్‌లింగం, అన్సన్, ఏపిఒ వంశీకృష్ణ, ఏపిఓ షాహిద్, ఎంపిటిసి సభ్యులు తులజమ్మ, రుక్మిణి బాయి, పెంటయ్య, సర్పంచ్‌లు రాజు, కవిత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**ఘనంగా ఎమ్మెల్యేకు సన్మానం...**

ఎమ్మెల్యే హోదాలో మొదటిసారి మండలానికి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డిని మండలంలోని ఆయా గ్రామాల నుంచి మనూర్‌కు చేరుకున్న ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌నాయకులు సోమవారం బాజాభజంత్రీలతో స్వాగతంపలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, రామచందర్, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, సాయిలు, వినోద్ పాటిల్, పోతుల సంగారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, న్యాయవాది సంగన్న, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.



అయ్యప్పస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

## అయ్యప్ప స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు మండల కాలం పాటు నిత్య అన్నధాన, అల్పాహార కార్యక్రమం నిర్వహిస్తున్న దాత ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం అయ్యప్ప ఆలయాన్ని సందర్శించి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేసి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డితో ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిత్యాన్నదాన, నిత్య అల్పాహారానికి సంబంధిత రుసుమును నిర్వాహకులకు ఎమ్మెల్సీ అందజేశారు. అందరు స్వాములకు దక్షిణ అందజేసి పాదాభివందనం చేశారు. ఆలయ కమిటీ నాయకులు,నిర్వాహకులు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డికి శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు దేవాగౌడ్, మహిపాల్‌రెడ్డి, యామిరెడ్డి, సాయాగౌడ్, శ్రీను నాయక్, ఎంపీటీసీ సిద్దిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ పురం వెంకట నారాయణ, ఏఎంసీ డైరెక్టర్ కొండా శ్రీను తదితరులు ఉన్నారు.

## ప్రజల పక్షాన నిరంతరం పోరాడతాం

### మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఓటమికి కార్యకర్తలు, నాయకులు నిరుత్సాహ పడాల్సిన అవసరంలేదని, అధికారం లో ఉన్నా, విపక్షంలో ఉన్నా ప్రజల మధ్యే ఉండాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమ వారం కమలాపురం గ్రామంలో స్థానిక సర్పంచి కుంట్ల రాములు సొంత ఖర్చులతో గ్రామ అవసరాల కోసం ఏర్పాటు చేసిన అంబెలెన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం పెద్దశంకరంపేట పార్టీ కార్యాలయంలో నాయకులు,కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రజలతోనే ఉన్నామని, ఇకమీదట అందరం ప్రజలతోనే కలిసి ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా పోషించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చెందే విధంగా పోరాటం చేయాలన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రకటించిన విధంగా 9వ తేదీన రుణ మాఫీ, వరి రైతులకు బోనస్, యాసంగి సీజన్‌కు రైతుబంధు, రైతు కూలీలకు రూ.12 వేలు ఎప్పు డిస్తారో ప్రకటించాలన్నారు. ఆరుగ్యారంటీలలో ఒక గ్యారంటీ పూర్తి అమలు జరుగలేదని, మహిళలకు రూ.2,500, రూ.500 వంట గ్యాస్, అమలుచేస్తే ఒక గ్యారంటీ పూర్తవుతుందని, నిరుద్యోగుల కోసం మెగా డీఎస్సీ వెంటనే ప్రకటించాలని పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో మహిళలకు ఉచితబస్సు ప్రయాణం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించకుండా వ్యవహరిస్తున్నారని, ఇది పునరావృతం కాకుండా అధికారులు చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యులు విజయ రామరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీ పంతులు, సురేష్‌గౌడ్, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## కస్తూరిభా బాలికల పాఠశాలను సందర్శించిన అసిస్టెంట్ డైరెక్టర్



పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ విజయ

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ విజయ, జీసీఈసీవో సుకన్య సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని వారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా, లేదా అని పరిశీలించడం జరిగిందన్నారు. ప్రతిరోజు పాఠశాలలో తయారు చేసిన భోజనాన్ని ఫోటోల ద్వారా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఖచ్చితంగా వాట్సాప్‌లలో పెట్టించుకుంటున్నామని వారు తెలిపారు. జిల్లాలో ఉన్న పదిహేను పాఠశాలల్లో సోలార్ హీటర్లు, త్రాగునీటి సమస్య పరిష్కారానికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారని, ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక సోమవారం పూజలు



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** పట్టణంలోని కార్తీక సోమవారం సందర్భంగా శ్రీభవాని శంకర్ ఆలయంలో మహన్యాస పారాయణ పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల వేద మంత్రాలు పటించారు. తిరిగి సాయంత్రం భవానిశంకర కళ్యాణ ఘట్టం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమాల్లో పాల్గొని విజయంతంచేసిన భక్తులకు అర్చకులు లింగమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

## వెల్దుర్తి ఉన్నత పాఠశాలకు స్కానర్, ప్రింటర్ అందజేత

**వెల్దుర్తి, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న ప్రముఖ వ్యాపారవేత్త ఎన్. రమేష్‌గౌడ్ సోమవారం అదే పాఠశాలకు విద్యార్థులకు అవసరమైన 20 వేల రూపాయల విలువ చేసే స్కానర్, ప్రింటర్‌లను పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. గతంలో విద్యార్థులకు బ్యాండ్ కావాలని కోరగా విద్యార్థుల కోరిక మేరకు బ్యాండ్ అందించడం జరిగిందన్నారు. నేడు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు ఒక మైక్‌సెట్ కావాలని కోరగా ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఎస్ఎంసీ చైర్మన్ కర్రె వెంకటేశం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమేశ్వర ఆలయంలో కార్తిక సోమవారం పూజలు

**చిన్నశంకరంపేట, నవంబర్ 11, ప్రభాతవార్త:** కార్తీక సోమవారం సందర్భంగా శ్రీసోమేశ్వర ఆలయంలో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు సోమవారం కావడంతో భక్తులు ఆలయానికి పోటేత్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు.



శ్రీసోమేశ్వర ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న వేద పండితులు